పాస్టర్లకు మరింత గౌరవం

- జగనన్న ప్రభుత్వంలో పాస్టర్లకు గౌరవ వేతనం అమలు
- మొదటి విడతలో ప్రతి నెలా రూ.5 వేల చొప్పున 129 మందికి లబ్ధి
- నిరంతరాయంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ



సి.క్యాంప్‌లోని ప్రార్థనా మందిరం

కర్నూలు (టౌన్): కులమతాలకు అతీతంగా పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అర్చకులు, ఇమాంలు, మౌజన్లు, పాస్టర్లకు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మత సామరస్యాన్ని మెరుగు పరిచేందుకు వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్న సదుద్దేశంతో గౌరవ వేతనం అమలు చేసింది. అందులో భాగంగానే చర్చి పాస్టర్ల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద పాస్టర్లకు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తోంది. చిన్నపాటి చర్చిల్లో ఉన్న పేద పాస్టర్లను గుర్తించి వారికి ప్రతి నెలా రూ.5 వేల ప్రకారం గౌరవ వేతనం అందిస్తోంది. 2020 సంవత్సరం నుంచి పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. నిబంధనల మేరకు అర్హులైన వారి నుంచి మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది.

43 వేల క్రైస్తవ కుటుంబాలు..

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో 43 వేల క్రైస్తవ కుటుంబాలు ఉన్నాయి. కర్నూలుతో పాటు పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో ఉన్న పేద పాస్టర్లు కూడా మైనార్టీ శాఖలో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. అలాగే నగరంలోని 133 సచివాలయాల్లోను దరఖాస్తులు సమర్పించవచ్చు. చర్చి స్థలం సదరు పాస్టర్ పేరు మీద ఉండాలన్న నిబంధనతో పాటు బ్యాంకు అకౌంట్ వంటి కొన్ని నిబంధనలు అమలు చేసింది. కర్నూలు నగరంలో 1,250 చర్చిలు ఉన్నాయి. ఇందులో పనిచేసే పాస్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఏ ముఖ్యమంత్రి వీరి గురించి ఆలోచించలేదు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు క్రైస్తవ సంఘాల నాయకులు కలిశారు. తమ గోడును విన్నవించుకున్నారు. పాస్టర్లను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆనాడు చెప్పిన మాటను ముఖ్యమంత్రి అయిన తరువాత సీఎం పేద పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తున్నారు. మొదటి విడతలో 186 మంది పాస్టర్లు గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోగా 129 మందిని ఎంపిక చేసి ప్రతి నెలా రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నారు. వీరి కోసం ఏటా రూ.77.40 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. కాగా దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం ఉంటుంది. ఎలాంటి గడువు విధించకుండా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభు త్వం వీలు కల్పించడంతో ఈ అవకాశాన్ని పేద పాస్టర్లు వినియోగించుకుంటున్నారు.

మాలాంటి వాళ్లకు ఎంతో మేలు



స్టాంటన్‌పురంలో ఉన్న బాప్టిస్టు జీవం గల దేవుని సంఘం చర్చిలో పాస్టర్‌గా సేవలు అందిస్తున్నాను. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలన్న నిర్ణయం మాలాంటి పేద పాస్టర్లకు ఎంతో ఊరట. గత ఏడాది ఆగస్టు 20వ తేదీ నుంచి గౌరవ వేతనం అందుతుంది. కుటుంబానికి ఆసరాగా ఉంది. గతంలో ఏ ఒక్కరూ ఇటువంటి ఆలోచన చేయలేదు.

– రెవరెండ్ పాస్టర్ మాదన్న

ముఖ్యమంత్రి నిర్ణయం హర్షణీయం



దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా పేద పాస్టర్ల గురించి ఆలోచించలేదు. దేవున్ని నమ్ముకుని చర్చిల్లో సేవ చేస్తున్నాం. చిన్నచిన్న చర్చిలలో దేవుని సేవ చేస్తున్నాం. అయితే ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. ఎవరూ ఆలోచించని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద పాస్టర్లకు ప్రతి నెలా రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్నాడు. 2022 సంవత్సరం నుంచి నాకు గౌరవ వేతనం అందుతుంది. కుటుంబ అవసరాలకు కొంత మేర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుంది. చాలా సంతోషం. మాలాంటి పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో ఏ ఒక్కరూ మా గురించి ఆలోచించిన పాపాన పోలేదు.

– సామన్న, క్రీస్తు సంఘం

క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేయాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఎం వెంకటరామం

కర్నూలు(రాజ్‌విహార్): అంకిత భావంతో పని చేసి డిపోల అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం అన్నారు. కారుణ్య నియామకల కింద ఇటీవల నియమితులైన అసిస్టెంట్ మెకానిక్‌లకు గురువారం స్థానిక జోనల్ కళాశాలలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బస్సుల కండీషన్‌ను మెరుగుపర్చడంతో పాటు వాటి నిర్వహణపై తగిన అవగాహన ఉండాలన్నారు. బస్సులు కండీషన్‌లో ఉంటేనే ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చగలుగుతామన్నారు. శిక్షణను నిర్లక్ష్యం చేయకుండా ఆసక్తితో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా, ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవి, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన పెంచుకోవాలి


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రకృతి వైద్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు ద్వారం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆయుష్ దత్తత గ్రామమైన పసుపుల గ్రామంలో ఆయుష్ గ్రామ వైద్యశిబిరం నిర్వహించారు. సాధారణ జబ్బులకు గ్రామంలో లభించే మూలికలను ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. ఆయుష్ శాఖ అందజేసిన 15రకాల ఏక మూలికా ఔషధ చూర్ణాలను ఏ జ బ్బులకు ఎలా ఉపయోగించాలో తెలిపారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తగినన్ని నీళ్లు, మజ్జి గ, నిమ్మ రసం, నన్నారి, చెరకు రసం, పండ్లు, తా టి ముంజలు, అవసరమైతే కొబ్బరి బోండాల నీరుతాగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని,సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయుర్వే ద వైద్యశాలకాంపౌండర్ మంగమ్మ పాల్గొన్నారు.

నేడు ఆదోనిలో బీజేపీ బీసీ సామాజిక చైతన్య సభ

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదోనిలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ తెలిపారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం ఆదోని పాతబస్టాండ్‌లోని రిక్రియేషన్ క్లబ్ మైదానంలో నిర్వహించనున్న సభలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పాల్గొంటారన్నారు. బీజేపీ, అనుబంధ సంఘాల బీసీ నాయకులు, కార్యకర్తలు సభలో పాల్గొనాలని సూచించారు.

క్వార్టర్లు ఖాళీ చేయండి

కర్నూలు (న్యూసిటీ): ప్రభుత్వ క్వార్టర్లలో అనుమతి లేకుండా నివాసం ఉన్న వారు వెంటనే ఖాళీ చేయాలని ఆర్అండ్‌బీ డీఈఈ రవి చంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లలోని 517 గదుల్లో అధికారికంగా ఉన్నారని, మరో 446 గదుల్లో అనధికారికంగా నివాసముంటున్నారని తెలిపారు. అనధికారికంగా ఉన్న వారి వివరాలు జిల్లా కలెక్టర్‌కు అందజేశామన్నారు. శిథిలావస్థకు చేరిన 40 భవనాల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చిన్నచిన్న మరమ్మతుల కోసం వంద భవనాలకు కలిపి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వానికి నివేదించామన్నారు.

18న జిల్లా స్థాయి ఈత పోటీలు

కర్నూలు (రూరల్): ఒలంపిక్ డే సందర్భంగా జిల్లా ఈత సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 9:30 గంటలకు కిసాన్ ఘాట్ వద్ద ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో బాలబాలికలకు జిల్లాస్థాయి ఈత పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు నరసింహయ్య ఆచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 14 ఏళ్లలోపు వారికి ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోల్, 12 నుంచి 17 ఏళ్ల వారికి ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోల్, ఇండివిడ్యువల్ మెగ్లే పోటీలు జరుపుతామన్నారు. విజేతలకు పతకాలు,అర్హత పత్రాలు ఇస్తామన్నారు.ఆసక్తి ఉన్న బాలబాలికలు ఆధార్ కార్డ్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9154076117నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దిశ యాప్ ఆపదలో ఆపన్న హస్తం

- మహిళా రక్షణ సదస్సులో డీఎస్పీ విజయశేఖర్


మాట్లాడుతున్న కర్నూలు డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ ఆపన్న హస్తం అందిస్తుందని దిశ మహిళా పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన దిశ యాప్ రిజిస్ట్రేషన్ – మహిళా రక్షణ కార్యక్రమంలో డీఎస్పీలు.. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఇన్‌స్టాగామ్ లాంటి యాప్‌లను తప్పుగా ఉపయోగించడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మహిళలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ యాప్‌ల ద్వారా పరిచయమయ్యే వ్యక్తులను నమ్మరాదని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు పంపి మోసపోయి జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. అలా మోసపోయిన వ్యక్తులు పడే కష్టాలు ఎలా ఉంటాయో వివరించారు. మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిశ యాప్ ఏ విధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా ఉపయోగించాలి, అందులో ఉండే ఫీచర్స్ గురించి కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్ సీఐ శ్రీరామ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలనరసింహులు, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ డీన్ శశికుమార్, కర్నూలు అర్బన్ తాలూకా మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం


నియామకం పత్రం అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక సంస్థలోని ప్రజారోగ్య విభాగంలో పనిచేసే జహిద్ మియ్యా అనే ఉద్యోగి గత ఏడాది సెప్టెంబర్ 26న మృతిచెందాడు. కారుణ్య నియామకం కింద అతని కుమారుడు షౌకత్‌హుస్సేన్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడంతో గురువారం మేయర్ బీవై రామయ్య తన చాంబర్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్లు రాజేశ్వర రెడ్డి, విక్రమసింహారెడ్డి, క్రిష్ణ కాంత్ రెడ్డి, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య గురువారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పూడిచర్ల గ్రామాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరి శీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఐరన్ సిరప్ అందిస్తున్నారా అని ఆరా తీశారు. అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశా లను సందర్శించి రక్తహీనత ఉన్న చిన్నారులకు ఐరన్ సిరప్ ఇవ్వాలని, ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం ఐదు హెల్త్ ఐడీలను జనరేట్ చేయాలన్నారు. ప్రజలకు వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

ఇన్‌చార్జ్ సీఐగా నాగశేఖర్



కర్నూలు: స్థానిక ఒకటవ పట్టణ ఇన్‌చార్జ్ సీఐగా ఎం నాగశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తిమ్మారెడ్డి ఇటీవల బనగానపల్లె సర్కిల్‌కు బదిలీ కావడంతో నాగశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (రూరల్): మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, క్లాప్ డ్రైవర్ల కనీస వేతనం రూ.18,500లకు పెంచాలని సీఐటీయూ న్యూసిటీ కార్యదర్శి సాయిబాబా డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నగర మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకులు టి.రాముడు, ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, విజయ్, న్యూసిటీ అధ్యక్షుడు నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు


చీఫ్ కోచ్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న క్రీడా శిక్షకులు

కర్నూలు (రూరల్): జిల్లా క్రీడాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాన్నని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఔట్ డోర్ స్టేడియంలో క్రీడా శిక్షకులతో చీఫ్ కోచ్ శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ క్రీడా సంఘాలు, వ్యాయమ ఉపాధ్యాయుల సమన్వయంతో జిల్లా క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. అనంతరం చీఫ్ కోచ్ శ్రీనివాసరావును క్రీడా శిక్షకులు సన్మానించారు. కార్యక్రమంలో శిక్షకులు భూపతిరావు, యూసిన్, పవన్, కాశీరావు, రాజేష్ పాల్గొన్నారు.



- కేసీ కెనాల్‌లో చెత్త తొలగింపు

నగరం మధ్యలో ప్రవహిస్తున్న కేసీ కాలువ వ్యర్థాలతో నిండుకుంది. ఎక్కడికక్కడ స్థానికులు ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాన్ని కాలువలోకి వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మూగజీవాలు కాలువలోని వ్యర్థాలు తిని అనారోగ్యం పాలవుతున్నాయి.ఈనెల 10న ఇదే విషయాన్ని 'సాక్షి' పలు ఫొటోలను ప్రచురించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే నష్టాన్ని వివరించింది. స్పందించిన కార్పొరేషన్ అధికారులు గురువారం కెనాల్‌లోని వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు ట్రాక్టర్ల సాయంతో కెనాల్‌ను శుభ్రపరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

19 నుంచి వారాహీ నవరాత్రులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వారాహీ నవరాత్రులు (గుప్త నవరాత్రులు) నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు వారాహీ అమ్మవారి షోడశోపచార పూజ, ఊంజల్ సేవ, దర్బార్ సేవ, మణి ద్వీప వర్ణన పారాయణం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

హాస్టల్ ప్రవేశాలకు త్వరపడండి

కర్నూలు(అర్బన్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వసతి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు హెచ్‌డబ్ల్యూఓ డి.మదారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ వసతి గృహంలో ప్రవేశం కల్పిస్తామని ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

18న భజరంగ్ దళ్ మాసిక వర్గ

కర్నూలు కల్చరల్: భజరంగ్ దళ్ మాసిక వర్గను ఈనెల 18న ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రెవెన్యూ కాలనీలోని శ్రీ హనుమాన్ వ్యాయామ శాలలో నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శౌర్య ప్రశిక్షణ వర్గ పూర్తి చేసుకున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు, సాప్తాహిక్ మిలన్, బలోపాసన కేంద్రాల్లో పాల్గొంటున్న కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి


మృతి చెందిన దుర్గా ప్రసాద్

కర్నూలు: కృష్ణానగర్ రైల్వే బ్రిడ్జి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఐనోళ్ల దుర్గాప్రసాద్ (16) తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కల్లూరులోని తారక రామ కాలనీకి చెందిన ఐనోళ్ల దుష్యంత, ధనలక్ష్మి దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం కృష్ణానగర్ బ్రిడ్జి వద్ద రైల్ ట్రాక్ దాటుతుండగా హైదరాబాద్ నుంచి వాస్కోడి గామాకు వెళ్తున్న ట్రైన్ ఢీకొంది. లోకో పైలెట్ గుర్తించి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి దుర్గాప్రసాద్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పీఎస్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అందుబాటులో డయాగ్నోస్టిక్ బ్లాక్


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల ప్రారంభమైన డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను సందర్శించి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి సూచనల మేరకు డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో చిన్న చిన్న మార్పులు చేసి అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. 24 గంటల ల్యాబ్‌లో ఉన్న పరికరాలను తీసుకొచ్చి ప్రస్తుతం కొత్త బ్లాక్‌లో ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు అవసరమైన బ్లాక్‌లు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో శాంపిల్ కలెక్షన్ పాయింట్, రిసెప్షన్, అల్ట్రాసౌండ్, బయోమెడికల్, పెథాలజీ, మైక్రోబయాలజీ, బ్లడ్‌బ్యాంకు, ఐసీటీసీ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులోనే కొత్తగా జనటిక్స్, స్లీప్ ల్యాబ్, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ ఏర్పాటు చే యనున్నామన్నారు. అవసరమైన మరికొన్ని ఎక్స్‌రే మిషన్లు, ఆటో అనలైజర్లకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ శివబాలనాగాంజన్ ఉన్నారు.

పేద పిల్లల భవిష్యత్తును సీఎం బాధ్యతగా తీసుకున్నారు


కిట్లను పంపిణీ చేస్తున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: పేదింటి పిల్లల భవిష్యత్తును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగా తీసుకున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ రామయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జేవీకే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం, దేవపూజ ధనుంజయ ఆచారి, యూనూస్, నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


కాలువల్లో పూడికతీత తీస్తున్న కార్మికులు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఈసారి ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రోజుకు ఒక్కరికి రూ.480 చొప్పున 180 మంది కార్మికులను తాత్కాలికంగా నియమించి పనులు చేయిస్తున్నారు. గురువారం స్థానిక పెద్దపార్కు ఎదురుగా ఉన్న ఖజానా జ్యువెలర్స్, వెంకటేష్ థియేటర్, యుకాన్ ప్లాజాతో పాటు అదే ఏరియాల్లోని ప్రధాన డ్రైన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. పనులను నగరపాలక శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పర్యవేక్షించారు. నెలాఖరులోపు పనులు పూర్తి చేస్తామన్నారు.

పీజీ విద్యార్థులకు విద్యా, వసతి దీవెన అందించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెనను పీజీ చదువుతున్న బీసీ విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. గురువారం ఆయన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్ ఎండీ అర్జున్‌రావును కలిసి వినతి పత్రం అందించారు.

ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పి కొడదాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్):రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లోని తన కార్యాలయంలో 18, 22వ వార్డుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంచి చేస్తుంటే చంద్రబాబు విషం చిమ్ముతున్నారన్నారు.సంక్షేమ పథకాలనుప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకురాలు విజయమనోహరి పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల నిధులతో చేపడుతున్న రామాలయా లు, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రాయలసీమ జిల్లాల దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రాణాప్రతాప్‌తో కలిసి కమిషనర్ గురువారం తిరుపతిలో ఎని మిది జిల్లాల సహాయ కమిషనర్‌లు, ఎస్ఈ, ఈఈ, డీఈఈలతో ఆలయాల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. టీటీడీ శ్రీవాణి పథకం కింద రూ.10 లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులు ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో చాలా నత్తనడకన సాగున్నాయన్నారు. పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు రామాంజనేయులు, సుధాకర్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్

కర్నూలు (టౌన్): జిల్లాలోని మున్సిపాలిటీలలో పనిచేస్తూ మ్యూచ్‌వల్, స్పౌస్, మెడికల్ పరంగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న సచివాలయాల ఉద్యోగులకు గురువారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు 103 మంది హాజరుకాగా, 88 మందిని బదిలీ చేసినట్లు మున్సిపల్ పరిపాలన ప్రాంతీయ సంచాలకులు సత్యనారయణ మూర్తి తెలిపారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, గూడూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.